క్లుప్తంగా

పేద ప్రజలకు అండగా ఉంటాం

అలంపూర్ : పేద ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులు మంగళవారం పంపిణీ చేశారు. మానవపాడు మండల కేంద్రానికి చెందిన లక్ష్మీకాంతమ్మ, మద్దిలేటికి, వడ్డేపల్లి మండలం రామాపురానికి చెందిన బజారమ్మకు ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి, వావిలాల రంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకట్రామయ్య శెట్టి, రవి ప్రకాష్, బాష తదితరులు పాల్గొన్నారు.

22వ రోజు కొనసాగిన సమ్మె

గద్వాల: తమ సమస్యల సాధనకు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 22వ రోజు కొనసాగింది. పట్టణంలోని రాజీవ్‌మార్గ్ స్మృతివనం వద్ద నిరవధిక సమ్మెలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులరైజ్ చేయాలని డిమాండు చేశారు. సమస్యలు పరిష్కారం, డిమాండ్లు సాధించేవ రకు సమ్మె విరమించేది లేదని పేర్కొన్నారు.

వర్గీకరణ చేసుకునే అధికారం ఉండాలి

ఉండవెల్లి : సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఏక సభ్య కమిషన్ మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించింది. ఈ నేపథ్యంలో వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉండాలని ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వందనయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులను కాపాడాలి

కేటీదొడ్డి: మండలంలో గువ్వలదిన్నె గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, కుల వివక్ష పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో శ్రీపాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కేటీదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని మల్లాపురంతండా గ్రామానికి చెందిన గజ్జలమ్మ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా సిద్దన్‌పల్లితండా శివారులో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి వెంకప్పనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

మల్దకల్ : మండలంలోని బిజ్వారం గ్రామంలో మంగళవారం నిన్ను వలే నీ పొరుగు వారిని ప్రేమించు అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నిరుపేదలకు దుస్తులు, భోజనం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవగుణాన్ని అలవరచుకుని తోటి వారికి సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జ్యోతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరువాడ ఘనంగా వేడుకలు


ధర్మవరంలో కేక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



ధరూరులో కేక్ కట్ చేస్తున్న శ్రీలక్ష్మీ స్కూల్ ఉపాధ్యాయులు



అలంపూర్ మాంటిస్సోరిలో డ్యాన్సుతో అలరిస్తున్న విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్ : నూతన సంవత్సర సందడి మొదలైంది. 2024 సంవత్సరానికి ముగింపు పలుకుతూ రాబోయే 2025 నూతన సంవత్సరానికి ఆహ్వానం పలకడానికి ప్రజలు ఏర్పాట్లలో మునిగిపోయారు. గ్రామాలు పట్టణాలు అనే తేడా లేకుండా గ్రీటింగ్ కార్డులు, బేకరీలు, డెకరేషన్ దుకాణాలు, మిఠాయి దుకాణాలు కొనుగోళ్లతో రద్దీగా మారాయి. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామాల్లోని ప్రధాన వీధులు, ప్రధాన మార్గాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మరో వైపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజలంతా సుభిక్షంగా జీవించాలి

ఎర్రవల్లి: నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా జీవించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ధర్మవరం చర్చిలో నాయకులు కొట్టం శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 100 కేకుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేడుకలు..

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం అప్పర్ ప్రైమరీ స్కూల్, నందిన్నె స్కూల్ విద్యార్థులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు..

ధరూరు : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ కాన్సెప్ట్ స్కూల్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

మాంటిస్సోరిలో అలరించిన వేడుకలు

అలంపూర్ : పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో వింటర్ ఫెస్ట్ వేడుకలు అలరించాయి. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఇంగ్లీష్ నైట్‌లో విద్యార్థులు ఇంగ్లీష్ నాటికలు, పాటలు, ఫన్ గేమ్స్ వంటి ప్రదర్శనలను కొనసాగించారు. ఫ్యాషన్స్ షో, హూప్ డ్యాన్స్, పిరమిడ్స్ వంటి వినూత్న ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. క్యాంప్ ఫైర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో డైరెక్టర్ కేఎన్‌వీ రవిప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉండవెల్లిలోని ఓ బేకరీలో కొత్తకొత్త కేకులు


ఎర్రవల్లిలో జనాలతో రద్దీగా ఉన్న బేకరి



అలంపూర్ విద్యార్థుల నృత్య ప్రదర్శన


ధరూరు : బేకరీ వద్ద కేకులు కొంటున్న ప్రజలు


పాతపాలెం కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

ఎర్రవల్లి: కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని బీజేపీ మండల ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోదండాపురం గ్రామంలో నూతన మండలాధ్యక్షుని ఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీలో చురుగ్గా పని చేస్తున్న జగదీష్ రెడ్డి, మల్లేష్, రాముడు పేర్లను అధిష్టానానికి పంపనున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపుకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేకేరెడ్డి, రామకృష్ణ, పరుశరాం, నరేష్, జనార్దన్ రెడ్డి, శివరాంరెడ్డి, విజయ్, నవీన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మాక్ ఎలక్షన్స్

గద్వాల న్యూటౌన్: స్థానిక మాంటిస్సోరీ ట్రెడిషన్స్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థుల చేత మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా, ఓటర్లుగా వ్యవహరించారు. ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవిప్రకాష్‌రెడ్డి విద్యార్థులకు ఎన్నికలు, ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమం వల్ల విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన, ఓటు హక్కు విలువ గురించి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

అయిజ: మండలంలోని తూంకుంట గ్రామంలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ధనుర్మాసంలో ఉన్నామని.. జ్ఞాన సముపార్జనకు ఇది సరైన సమయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగప్ప, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, నరసింహ, శివ, జములమ్మ, అనంతమ్మ, పద్మమ్మ, సుభద్రమ్మ, దీపిక, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

బాధితునికి ఆర్థిక సాయం అందజేత

మానవపాడు: మండల పరిధిలోని పెద్ద ఆముదాలపాడు గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఎం.ఎబ్బన్నకు యంగ్ టర్క్స్ సంస్థ నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందించిన ఔదార్యానికి గుర్తుగా సంస్థ వ్యవస్థాపకుడు తరుణ్‌రెడ్డి నాయకత్వంలో స్వయం ఉపాధిని పొందడం కోసం మంజూరైన రూ.50,000 నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యుగందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూచిపూడి గ్రామంలో కూచిపూడి హెరిటేజ్ సొసైటీ వారు నిర్వహించిన కూచిపూడి విశ్వ నర్తనంలో పట్టణంలోని కేపీఎస్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, సర్టిఫికెట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. కూచిపూడి న్యాటంలో దాదాపు మూడు వేల మంది పాల్గొనగా కేపీఎస్ స్కూల్‌కు చెందిన 12మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులు కూచిపూడి నాట్యంలో ప్రదర్శన చాటేందుకు కృషి చేసిన కూచిపూడి టీచర్ సుచరితను విద్యార్థినులను మంగళవారం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయ బృందం

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ధరూరు : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేమి కాదని మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్ర బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇంటి వద్ద పిల్లలు చదువుకునే వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కొత్త మెనూ ప్రకారం నాణ్యతగా భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీ మహిళలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా దానం చాలా గొప్పది

శాంతినగర్ : దానాలన్నింటిలోకెల్లా విద్యా దానం చాలా గొప్పదని ఎంఈఓ నరసింహ అన్నారు. తల్లిదండ్రులు లేని 29 మంది అనాథ విద్యార్థులకు ఉచితంగా విద్య అందించడమంటే గొప్ప విషయమన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో చదువుతు 29 మంది అనాథ విద్యార్థులకు సంబంధించి ఎంఈఓ నరసింహ చేతుల మీదుగా వారి గార్డియన్స్‌కు ఫ్రీ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యజమానులు కరస్పాండెంట్ మమత, రవిలను కొనియాడారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక, అడవి సంప్రదాయాలకు అనుగుణంగా చేసిన నృత్యాలు అలరించాయి.


శాంతినగర్‌లో గార్డియన్స్‌కు ఫ్రీఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ నరసింహ

సమయపాలన పాటించాలి..

మల్దకల్ : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మద్దెలబండ పెద్దతాండా, మద్దెలబండ చిన్నతాండా పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనుమతులు లేకుండా ఉపాధ్యాయులు సెలవు తీసుకోకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలి

రాజోళి: పార్టీలోని సభ్యులు, కార్యకర్తలు అందరి సహకారంతో పార్టీని అభ్యున్నతికి కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రం రాజోళిలోని వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటైనింగ్ అధికారిగా ఓంకార్‌ను ఎన్నుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సమన్వయం చేసుకుంటూ, పార్టీ అభ్యున్నతి కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శశి కుమార్, అంజనేయులు, తిరుపతి, దేవేంద్ర, భీమన్న కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో బీజేపీ నాయకులు

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో దళిత ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయం ఎదుట నాయకులు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో విద్యార్థిని మందలించిన నేపథ్యంలో మతోన్మాదులు కొందరు దళిత ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేశారన్నారు. వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహ, శేఖర్, అశోక్, రాముడు, వీరన్న, నాగన్న, లక్ష్మన్న, ఎల్లప్ప, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉత్తమ సేవలే గుర్తింపు తెస్తాయి

గద్వాల : ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసని, విధి నిర్వాహణలో వారు చేసిన ఉత్తమ సేవలే వారికి గుర్తింపు తీసుకొస్తాయని రెవెన్యూ అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జిల్లా క్రీడాఅధికారి బీఎస్ ఆనంద్ పదవీ విరమణ సందర్భంగా సన్మానం చేశారు. ఆనంద్ క్రీడారంగంలో విశేష కృషి చేశారని కొనియాడారు. విరమణ జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఏవో వీరభద్రప్ప, వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


ఆనంద్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు

10న వైకుంఠ ఏకాదశి పూజలు

రాజోళి: ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం అర్చకులు, కమిటీ సభ్యులు ఆలయంలో పరిసరాలు పరిశీలించారు. ప్రతి ఏడాది స్థానిక వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏకాదశి రోజున వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఎస్ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

అయిజ: అవినీతిపరుడికి అండగా ఉన్న ఎస్ఐ విజయభాస్కర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని తూంకుంటకి చెందిన గజేంద్రగౌడ్ అలియాస్ ఈరన్నగౌడ్ తెలంగాణ, ఏపీ, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్, బిట్ కాయిన్, షేర్ మార్కెట్ల పేరుతో ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. గుజరాత్‌కు వెళ్లి అక్కడ నుంచి బ్యాంకాక్‌కు పారిపోయాడని, ఆయనకు ఎస్ఐ విజయభాస్కర్ అండదండలున్నాయని ఆరోపించారు. అయిజకి చెందిన వీరేశాచారి 9ఎకరాల ముప్పై గుంటలు భూమిని గజేంద్రగౌడ్‌కు విక్రయించినట్లు తెలిపారు. రూ.1.53 కోట్లు అడ్వాన్స్ తీసుకొని భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారన్నారు. ఇంకా రూ.1.50 కోట్లు ఇవ్వాల్సి ఉండగా గుజరాత్‌కు పారిపోయాడని తెలిపాడు. ఈ విషయంపై అక్టోబర్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. డిసెంబర్ 19న డీఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తాను కష్టపడి గజేంద్రగౌడ్‌ను బ్యాంకాక్ నుంచి తీసుకొస్తే తనపైనే ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తాను వెళ్లి ఎస్పీకి ఫిర్యాదు చేయగా ఎస్ఐపై ఆయన మండిపడ్డారు. గజేంద్రగౌడ్‌పై డీజీపీతోపాటు విజిలెన్స్, ఏసీబీకి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న షేక్షావలి ఆచారి

పెన్షనర్ల డైరీ ఆవిష్కరణ

గద్వాల: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని గద్వాల పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం నూతన సంవత్సర-2025 పెన్షనర్ల డైరీని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో డీటీవో విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అబ్దుల్ బాబు, ప్రభాకర్, నాగరాజు, ఇక్బాల్‌పాష తదితరులు పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరిస్తున్న డీటీవో విజయ్‌కుమార్, విశ్రాంత ఉద్యోగులు

పడిపూజకు ముస్తాబైన ఆలయం

అయిజ: మహా పడిపూజకు మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం ముస్తాబైంది. స్వామి వారికి చేయించిన బంగారు హారం, పంచలోహ విగ్రహానికి బుధవారం శోభాయాత్ర నిర్వహించనున్నారు. అదే విధంగా సాయంత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు మహా పడిపూజ నిర్వహించనున్నారు. పూజలకు వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


ముస్తాబైన అయ్యప్ప స్వామి ఆలయం